దిగుబడి ఉన్నా.. ధర లేదన్నా!

- పడిపోయిన బీరకాయల ధరలు
- రైతులకు తీవ్ర నష్టం

కనగానపల్లి: ఆరుగాలం కష్టపడి పనిచేసే రైతన్నకు నష్టాలే మిగులుతున్నాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట సాగు చేస్తే సరైన గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా ఉద్యాన పంటల పరిస్థితి అధ్వానంగా తయారైంది. బీరకాయలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

భారీగా పెట్టుబడులు

మండలంలోని పలు గ్రామాల్లో రైతులు బీర పంటను సాగు చేశారు. తక్కువ కాలంలో పంట చేతికి వచ్చే ఈ పంటను కనగానపల్లి, యలకుంట్ల, నరసంపల్లి, మామిళ్లపల్లి గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో రైతులు సాగు చేశారు. పందిరి, కట్టెల అల్లకం ద్వారా ఈ పంట సాగు చేయాలంటే ఎకరానికి రూ.లక్ష పైగా పెట్టుబడి వస్తుంది. దీంతో పాటు సాగులో విత్తనాలు, ఎరువులు కూలీల ఖర్చులు ఎక్కువగానే వస్తాయి. అయితే పంటకు వాతావరణం బాగా అనుకూలిస్తే ఎకరానికి 14 టన్నుల వరకు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు.



కనగానపల్లిలో కట్టెల ద్వారా సాగుచేసిన బీర తోట

అమాంతం పడిపోయిన ధరలు..

రైతులు పంట సాగు చేసిన సమయంలో ధరలు బాగానే ఉన్నాయి. అయితే ఇటీవల అమాంతం పడిపోయాయి. అయితే మొదట టన్ను రూ.20 వేలకు పైగా ఉన్న బీర కాయల ధర ప్రస్తుతం మార్కెట్లో రూ.12 వేలకు పడిపోయాయి. రోజుల వ్యవధిలోనే దాదాపు రూ.8 వేలకు పైగా ధరలు తగ్గిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తమకు పెట్టుబడి కూడా దక్కుతుందో లేదోనని వాపోతున్నారు. ప్రభుత్వం తమకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు.

పెట్టుబడి కూడా దక్కేలా లేదు..



రూ.4 లక్షల దాకా పెట్టుబడి పెట్టి రెండున్నర ఎకరాల్లో బీర పంట సాగు చేశా. పంట సాగు చేసిన తర్వాతా 40 రోజులకే పంట చేతికి వచ్చింది. ఇప్పటి వరకు మూడు కోతలకు 30 టన్నుల దాకా దిగుబడి వచ్చింది. అయితే మొదటిసారి రూ.20 వేలకు పైగా ఉన్న బీర కాయల ధర ప్రస్తుతం మార్కెట్లో రూ.12 వేలకు పడిపోయింది. దీంతో పంట దిగుబడి బాగున్నా గిట్టుబాటు ధర లేక పంట పెట్టుబడి కూడా దక్కేలా లేదు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– పెద్దకుళ్లాయప్ప, రైతు, కనగానపల్లి

రైతులకు మామిడి మొక్కల పంపిణీ

కనగానపల్లి: పీఎస్‌పీ అగ్రోఫారెస్ట్రీ కార్బన్ ప్రాజెక్టు ద్వారా మండలంలోని రైతులకు ఉచితంగా మామిడి మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు ఆ ప్రాజెక్టు మేనేజర్ వంశీ సందీపం తెలిపారు. ముక్తాపురం, మామిళ్లపల్లి గ్రామాల్లోని రైతులకు మంగళవారం ఆ ప్రాజెక్టు ప్రతినిధులు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో వ్యవసాయ భూముల్లో స్థిరమైన అగ్రోఫారెస్ట్రీ పద్ధతుల ద్వారా పండ్ల మొక్కలను సాగు చేయిస్తున్నామన్నారు. ఇందుకోసం ఈ కార్బన్ ప్రాజెక్టు ద్వారా రైతులకు ఉచితంగా పండ్ల అందజేస్తున్నామన్నారు. కనగానపల్లి మండలంలో 10 గ్రామాల్లో రైతులు సుమారు 3 వేల ఎకరాల్లో మామిడి మొక్కలు నాటేందుకు ముందుకు వచ్చారన్నారు. వీరందరికీ మేలు రకమైన మామిడి మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు ప్రతినిధి మధు, రైతులు పాల్గొన్నారు.



మామిళ్లపల్లిలో రైతులకు మామిడి మొక్కలు అందిస్తున్న దృశ్యం

విత్తనశుద్ధి తప్పనిసరి

తాడిమర్రి: ఖరీఫ్ పంటల సాగులో తప్పనిసరిగా విత్తనశుద్ధి పాటించాలని, ఇలా చేయడం వల్ల పంటలకు చీడ, పీడలు ఆశించవని మండల వ్యవసాయ అధికారి శేఖర్ నాయక్ రైతులకు సూచించారు. ఏకపాదంపల్లిలో మంగళవారం ఆయన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వర్షాలు కురిసి భూమిలో తేమ ఉన్నప్పుడే విత్తనం వేసుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి 40 శాతం సబ్సిడీపై పొందిన విత్తనాలను ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేరుశనగ పంటలో మేరసాలల్లో జొన్న, సజ్జ తదితర పంటలు వేసుకోవాలన్నారు. అలాగే అంతరం పంటలుగా కంది, అలసంద, పెసర తదితర పంటలను సాగు చేసుకోవాలన్నారు. దీంతో చీడ, పీడల ఉధృతి తగ్గడంతో పాటు అదనపు ఆదాయం పొందవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ వైష్ణవి, వీహెచ్ఏ గౌతమి, రైతులు ధనుంజయ, లక్ష్మీనరసింహులు తదితరులు పాల్గొన్నారు.



ఏకపాదంపల్లిలో రైతులకు సలహాలు ఇస్తున్న అధికారులు

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

తనకల్లు: రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని ఏఓ భారతి సూచించారు. మండల పరిధిలోని గుంజువారిపల్లి, రెడ్డివారిపల్లిలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ సేంద్రియ ఎరువులను వాడడం వల్ల భూసారం పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలన్నారు. వేరుశగన, మొక్కజొన్న, వరి సాగులో చేపట్టాల్సిన సమగ్ర పంట యాజమాన్య పద్ధతులు, చీడ పీడల నివారణ గురించి వివరించారు. రైతులకు 80 శాతం సబ్సిడీపై డ్రోన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. అపంతరం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ పథకాలు, షేడ్ నెట్లు, ప్యాక్‌హౌస్‌లను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి లావణ్య, ఏఈఓ ప్రశాంతి, వీహెచ్ఏ భార్గవి, రైతులు పాల్గొన్నారు.

పురుగుమందు పిచికారీలో జాగ్రత్తలు తీసుకోవాలి

కదిరి అర్బన్: పంటలపై పురుగు మందులు పిచికారీ చేసేటపుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే మానవ శరీరభాగాలపై దుష్ప్రభావం చూపుతాయని ఏఓ శ్రీహరినాయక్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ సరైన రక్షణ కవచాలు లేకుండా పురుగుమందు పిచికారీ చేయకూడదన్నారు. పురుగుల మందు కొనుగోలు చేసేటపుడు షాపునకు లైసెన్స్ ఉందా.. తయారీ తేదీ, గడువు తేదీ తదితర విషయాలను గుర్తించాలన్నారు. పురుగుమందు తీసుకున్నాక బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో 'ఆత్మ' అధికారి మౌనిక, వేమనారాయణతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం





ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు , టెన్త్ టాపర్ లోకేశ్వర్‌రెడ్డికి నగదు బహుమతి అందిస్తున్న దృశ్యం

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం సిద్దరాంపురం ఉన్నత పాఠశాల నుంచి ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు నారాయణస్వామి, బాబయ్య, జయచంద్ర, గోపాల్‌రెడ్డి, ఓబిరెడ్డి, రమేశ్, నాగమణి, సుజనమ్మ, జయరాంలను పూర్వ విద్యార్థులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల సేవలను ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు రవీందర్‌రెడ్డి, బయారెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, కృష్ణమూర్తి, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శంకర్, వేణు తదితరులు కొనియాడారు. అలాగే పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులతో ప్రతిభ కనబరచిన విద్యార్థులు లోకేశ్వరరెడ్డికి రూ.25వేలు, అనూషకు రూ.6వేలు, అఖిలకు రూ.3వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

బీమా చట్టాల సవరణ బిల్లు వద్దు

హిందూపురం: కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేలా నిర్ణయాలు తీసుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం కావాలని ఎల్ఐసీ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, ఉద్యోగుల సంఘం హిందూపూర్ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బి.నరసింహులు పిలుపునిచ్చారు. సంఘం అధ్యక్షులు యల్.చంద్రకళ ఆధ్వర్యంలో స్థానిక ఎల్ఐసీ డివిజనల్ ఆఫీసు ఎదుట దేశవ్యాప్త పిలుపుమేరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో బీమా చట్టాల సవరణ బిల్లును ప్రవేశ పెట్టనున్నారని దాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎల్ఐసీలో ప్రభుత్వం తన వాటాలను ఉపసంహరించుకునే కార్యక్రమానికి మరోమారు ప్రయత్నించడం సరికాదన్నారు. ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో కొత్త పెన్షన్ విధానానికి స్వస్తిపలికి పాత పెన్షన్ విధానాన్ని అమలుకు సిద్ధపడుతున్నాయని చెప్పారు. ఎల్ఐసీలో కూడా అందరికీ పాత పెన్షన్ విధానమే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు మధుసూదన్‌రావు, గంగాధర్, శ్రీలక్ష్మి, మాధురిబాయ్, మాధురిలత, జ్యోతిర్మయి, మాధవి, నాగారత్న, నాగరాజు, రామచంద్రప్ప, మనీష్ ప్రీతం, రవితేజ, పెన్షన్ యూనియన్ సభ్యులు నాగప్ప,నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఐసీ ఆఫీసు వద్ద నిరసన తెలుపుతున్న ఎల్ఐసీ ఉద్యోగులు

ద్విచక్రవాహనం అపహరణకు యత్నం

సోమందేపల్లి: మండలంలోని మాగేచెరువు గ్రామంలోని శివప్పకు చెందిన ద్విచక్ర వాహనాన్ని ఇద్దరు యువకులు అపహరించే ప్రయత్నం చేసిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. రాత్రి 11 గంటల ప్రాంతంలో ఇంటి వద్ద ఆపి ఉన్న పల్సర్ ద్విచక్ర వాహనాన్ని మరో బైక్‌లో వచ్చిన యువకుడు తోసుకుంటూ వెళుతుండగా గ్రామస్తులు గమనించి నిలువరించారు. వాహన యజమానికి సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకొని వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులుకు సమాచారం ఇవ్వగా వారిద్దరినీ అదుపులోకి తీసుకుని పోలీసులు స్టేషన్‌కు తరలించారు.

సజావుగా ప్రవేశ పరీక్ష

అమరాపురం: మండల పరిధిలోని హాలుకూరు గ్రామ సమీపంలో ఉన్న ఏపీ మోడల్ పాఠశాలలో 6, 7, 8, 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి మంగళవారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష సజావుగా జరిగింది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు మోడల్ పాఠశాలలో పరీక్షలను రాశారు. పరీక్షలను ప్రిన్సిపాల్ హనుమన్న, ఉపాధ్యాయులు మంజునాథ ఆధ్వర్యంలో నిర్వహించారు. 6వ తరగతికి 21 మంది, 7వ తరగతికి 21, 8వ తరగతికి 27, 9వ తరగతి ప్రవేశానికి 11 మంది పరీక్షలకు హాజరైనట్లు పేర్కొన్నారు.

తిరుపతికి హైరిస్క్ గర్భిణి

ముదిగుబ్బ: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) ఫైరోజ్‌బేగం మంగళవారం ముదిగుబ్బ పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ల్యాబ్, ఫార్మసీ, ఓపీ వైద్య సేవలను పరిశీలించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్న హైరిస్క్ గర్భిణి వెంగమ్మను గుర్తించి మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి తిరుపతి మెటర్నిటీ ఆస్పత్రికి 108లో పంపించారు.



గర్భిణిని అంబులెన్సులో తరలిస్తున్న దృశ్యం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



తాడిమర్రి పీహెచ్‌సీలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హరిత



తాడిమర్రి హాస్టల్‌లో మిలాథిన్ పిచికారీ చేయిస్తున్న దృశ్యం

తాడిమర్రి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి హరిత సూచించారు. తాడిమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఓపీలో పలువురు రోగులకు ఆమె చికిత్సలందించారు. మురుగునీరు నిల్వ, పరిసరాల అపరిశుభ్రత కారణంగా దోమలు వృద్ధి చెంది వ్యాధులు వ్యాపింపజేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. దగ్గు, జలుబు, జ్వరం వస్తే ప్రవేటు, ఆర్ఎంపీ వైద్యులను ఆశ్రయించకుండా ప్రభుత్వ ఆస్పత్రికి రావాలన్నారు. ఇక్కడ 57 రకాల జబ్బులకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అన్ని వ్యాధులకు మందులు అందుబాటు ఉన్నాయని ఆమె సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని ఉచిత వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె ప్రజలకు తెలిపారు.

దోమలు ఉత్పత్తి కాకుండా జాగ్రత్తలు పాటించాలి

తాడిమర్రి: దోమలు ఉత్పత్తి కాకుండా జాగ్రత్తలు పాటించాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జయరామ్ నాయక్ సంక్షేమ వసతి గృహాల అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలతో కలసి తాడిమర్రిలోని కేజీబీవీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో మిలాథిన్ స్ప్రేయింగ్ చేయించారు. విద్యార్థుల ట్రంక్ పెట్టెలు, బ్యాగులను బయట పెట్టించి మందు పిచికారి చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపునీరు, మురుగునీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండటంతో దోమలు ప్రబలి జ్వరాలు వ్యాపిస్తాయన్నారు. దోమలు ప్రబల కుండా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతలను పాటించాలన్నారు. ఒక్కసారి మిలాతిన్ పిచికారి చేయడం వల్ల 90 రోజులు దోమల బెడద ఉండదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, కోమలి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమతెరలు వాడాలి

తనకల్లు: సీజీ ప్రాజెక్టు వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాలలోని విద్యార్థులకు వైద్యాధికారి ధర్మరాజు ఆధ్వర్యంలో మంగళవారం డెంగీ, మలేరియాపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాకాలంలో మలేరియా, డెంగీ, చికున్‌గన్యా తదితర రోగాలు అధికంగా వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు దోమతెరలు వాడాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బాలికల్లో రక్తహీనత ఉంటుందని, ఐరన్ ఫోలిక్ మాత్రలను ప్రతి వారం తీసుకోవాలని పేర్కొన్నారు. ఆహారంలో కోడిగుడ్లు, కూరగాయలు, రాగి జావ తప్పక తీసుకోవాలన్నారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

తనకల్లు: చిన్న, సన్నకారు రైతులు పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రామానాయక్ కోరారు. 2025–26 ఏడాదికి గాను ఉపాధి హామీ పథకంలో భాగంగా మామిడి, జామ, సపోట, కొబ్బరి, దానిమ్మ, అల్లనేరేడు, సీతాఫలం, మునగ, డ్రాగన్ ఫ్రూట్, మల్లె, గులాబీ, పూలతోటలు తదితర 18 రకాల మొక్కలు అందిస్తామన్నారు. అర్హులైన రైతులు జూలై ఒకటో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలను మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పారదర్శక ఓటర్ల జాబితాకు సహకరించండి

ధర్మవరం అర్బన్: ఓటర్ల జాబితాను పారదర్శకంగా ఉండేలా రాజకీయ నాయకులు సహకరించాలని ఆర్డీఓ మహేష్ తెలిపారు. ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు ఏవైనా సరిగ్గా లేకపోతే అభ్యంతరాలు తెలియజేయాలని ఆర్డీఓ సూచించారు. ధర్మవరం నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,46,866 ఉన్నాయని తెలిపారు. ధర్మవరం అర్బన్‌లో 1,05,873 మంది, ధర్మవరం రూరల్‌లో 34,719 మంది, బత్తలపల్లి మండలంలో 32,738, తాడిమర్రి మండలంలో 25,654, ముదిగుబ్బ మండలంలో 47,882 మంది ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. 18 సంవత్సరాల వయసు నిండిన యువతీ యువకులు ఆన్‌లైన్ ద్వారా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌బాబు, ఎన్నికల డీటీ ఈశ్వరయ్య, ఎన్నికల అసిస్టెంట్ రాఘవరెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ధర్మవరం రూరల్: గరుడంపల్లి పొలాల్లోని పేకాట స్థావరంపై మంగళవారం దాడులను నిర్వహించినట్లు ధర్మవరం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.6,200 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ ఆదాయం పెంపునకు కృషి చేయాలి



ఆదర్శ ఉద్యోగులకు చెక్కు పంపిణీ చేస్తున్న డిపో మేనేజర్

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ ఆదాయం పెంపునకు ప్రతి ఉద్యోగీ కృషి చేయాలని డిపో మేనేజర్ ఇనయతుల్లా కోరారు. మంగళవారం పుట్టపర్తి ఆర్టీసీ డిపో ఆవరణలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ ఏర్పాటు చేశారు. 2025 మే నెలలో తమకు ఇచ్చిన సర్వీస్ టార్గెట్ కంటే ఎక్కువ ఆదాయం ఆదాయం ఆర్జించి విశిష్ట ప్రతిభ కనబరిచిన నలుగురు కండక్టర్లకు, డీజిల్ పొదుపు సాధించిన ముగ్గురు డ్రైవర్లకు నగదు పురస్కారాలు అందజేసి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అనంతరం చెక్కులను అందజేశారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగీ, కార్మికులు బాధ్యతగా పనిచేసి ఆర్టీసీ సంస్థను లాభాల బాటలో పయనింపజేయాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌చార్జ్ హరిత, గ్యారేజ్ ఇన్‌చార్జ్ విజయానందతోపాటు సూపర్‌వైజర్లు, కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ముగ్గురు విద్యార్థుల ఎంపిక



ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థి భవ్యశ్రీ

ఓడీచెరువు : మండల కేంద్రం ఓడీచెరువులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయురాలు శిరీష తెలిపారు. భవ్యశ్రీ, అజిత్‌కుమార్ ఒంగోలు ట్రిపుల్ ఐటీ, దాదాపీర్ పులివెందుల ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం, పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.

బాధితులకు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న నాయకులు

కదిరి టౌన్: ఎర్రదొడ్డి గ్రామానికి చెందిన మహేశ్వర్‌రెడ్డి వర్గీయుల దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాంబశివ దంపతులను రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం అధ్యక్షుడు బంగారు క్రిష్ణమూర్తి, వాల్మీకి సంఘం స్టేట్ జాయింట్ సెక్రెటరీ ఆనంద్ తదితరులు మంగళవారం పరామర్శించారు. వాల్మీకులపై దాడి ఆమానుషమన్నారు. పరస్పర దాడులు జరిగినందున ఇరు వర్గాలపై కేసు నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు సూరి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'తల్లికి వందనం' అందేలా చూడండి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ బాలకృష్ణుడు

చెన్నేకొత్తపల్లి: అర్హులందరికీ 'తల్లికి వందనం' పథకం అందేలా చూడాలని ఎంపీడీఓ బాలకృష్ణుడు సచివాలయ సిబ్బందికి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండలంలోని సచివాలయ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ తల్లికి వందనం అందని వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. పథకం అందకపోవడానికి గల వారికి కారణాలను తెలుసుకుని సమస్య పరిష్కరించాలన్నారు.

ఆర్టీసీ బస్టాండ్లలో సౌకర్యాల కల్పనకు కృషి



ఆర్టీసీ ఉద్యోగులకు సూచనలిస్తున్న ఆర్ఎం మధుసూదన్

హిందూపురం: ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికుల సౌకర్యవంతంగా ఉండటానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్లలో 40 కుర్చీలు, 32 ఫ్యాన్లను ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్ అన్నారు. మంగళవారం హిందూపురం బస్టాండ్, బస్సు డిపోలను ఆయన తనిఖీ చేశారు. బస్టాండ్‌లో దుకాణాలను పరిశీలించి చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా చెత్తకుండీల్లో వేయాలని వ్యాపారులకు సూచించారు. అనంతరం డిపోలో ఉద్యోగులను సమావేశపరచి బస్సుల నిర్వాహణలో నాణ్యత, మెరుగైన సదుపాయలు, మైలేజీలను మెరుగు పర్చడానికి సూచనలు చేశారు.

ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ బాధ్యతల స్వీకరణ



ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న ఎంపీడీఓ పోలప్ప

కదిరి అర్బన్: ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ (డివిజనల్ లెవెల్ పంచాయతీ ఆఫీసర్)గా వెంకటరత్నం మంగళవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డివిజన్ పరిధిలోని ఎంపీడీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, వీధి దీపాల నిర్వహణ, సర్వే తదితర అంశాలపై సమీక్షించారు. ఎంపీడీఓలందరూ సమన్వయంతో పని చేసి పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చెన్నేకొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాలకృష్ణుడు మంగళవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ అంజలి అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

సీసీ కెమెరాలు పనిచేసేలా చూసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నారాయణరెడ్డి

కదిరి టౌన్: లాడ్జీల్లో సీసీ కెమెరాలు పనిచేసేలా చూసుకోవాలని పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి నిర్వాహకులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో పట్టణంలోని లాడ్జీ, డార్మెటరీ, రెసిడెన్సి యజమానులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ లాడ్జీల్లో కొత్త వ్యక్తులు వచ్చినపుడు వారి పూర్తి వివరాలు సేకరించాలని, గుర్తు తెలియని, అనుమానిత వ్యక్తుల కదలికలను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

డీఎల్‌పీఓ విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ శివకుమారి

చెన్నేకొత్తపల్లి: నాగసముద్రం పంచాయతీలో పంచాయతీ నిధుల దుర్వినియోగం జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై డీఎల్‌పీఓ శివకుమారి విచారణ చేపట్టారు. మంగళవారం స్థానిక సచివాలయానికి చేరుకుని రికార్డులను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శిని చంద్రికను అడిగి తెలుసుకున్నారు. విచారణ నివేదికను త్వరలో ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆమె తెలిపారు. సర్పంచ్ ఎం .సుధారాణి, ఈఓఆర్డీ అశోక్‌నాయక్ పాల్గొన్నారు.

ఉచితంగా మందుల అందజేత

ధర్మవరం అర్బన్: శ్రీ సత్యసాయి సేవా సమితి సేవాదళ్ సభ్యులు సాంబశివుడు, కాకుమాని విద్యాసాగర్, నాగిరెడ్డి, వెంకటేషులు, శేషాద్రి ఆధ్వర్యంలో పట్టణంలోని సుబ్బదాసు సత్రంలో 300 మంది పేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

జగన్‌ను కలిసిన రేగాటిపల్లి సురేష్‌రెడ్డి



ధర్మవరం రూరల్: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేగాటిపల్లి సురేష్‌రెడ్డి మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ధర్మవరం నియోజకవర్గంలోని సమస్యలపై అధినేత ఆరా తీశారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని తనకు సూచించినట్లు సురేష్‌రెడ్డి తెలిపారు.

